క్లుప్తంగా

ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

గుత్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మాజీకార్యదర్శి నిర్మల, మండల కార్యదర్శి మున్ని ఆరోపించారు. బుధవారం బసినేపల్లిలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాన్ని వారు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో నిధులను తగ్గించి కూలీలకు దగా చేస్తోందన్నారు. ఈ వేసవి నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రతి ఉపాధి కూలీకి రోజుకు రూ.600 వేతనం వచ్చేలా చట్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఈ నెల 15 నుంచి 18 వరకూ పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో జరిగే అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం 10 మహాసభలకు సంబంధించి జెండాను ఆవిష్కరించారు. సీపీఎం మండల కార్యదర్శి రామకృష్ణ, నాయకురాళ్లు నిర్మల, మున్ని పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు రూరల్: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రాముకు అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం


భక్తులకు అన్నం వడ్డిస్తున్న సబ్ రిజిస్ట్రార్ సమీర్

గుంతకల్లు రూరల్: కసాపురంలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదానం కోసం గుంతకల్లు సబ్ రిజిస్ట్రార్ సమీర్ రూ.50,116 విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా బుధవారం లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించిన సబ్ రిజిస్ట్రార్ సమీర్ అనంతరం టీపీఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. అనంతరం భక్తులకు భోజనం వడ్డించారు. టీపీఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత పరశురాముడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాయల జయంతిని జయప్రదం చేయండి

గుత్తి: స్థానిక రాయల్ సర్కిల్‌లోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద గురువారం తలపెట్టిన శ్రీకృష్ణదేవ రాయల జయంతి వేడుకలను జయప్రదం చేయాలని గుత్తి, గుత్తి మండల బలిజ సంఘం అధ్యక్ష, గౌరవాధ్యక్షులు రమణ, పీవీ రమణ, కార్యదర్శి రాము, కోశాధికారి మంజు కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9.30 గంటలకు జరిగే వేడుకలకు బలిజ కులస్తులు పెద్దసంఖ్యలో రావాలని కోరారు.

విద్యుత్ మోటార్ల మరమ్మతు

గుత్తి: పట్టణంలోని 15,16వ వార్డుల్లో స్పాట్ డెలివరీ ట్యాంకులకు సంబంధించిన విద్యుత్ మోటార్లను మున్సిపల్ ఎలక్ట్రికల్ సిబ్బంది బుధవారం మరమ్మతు చేశారు. మూడు రోజుల క్రితం మొత్తం మూడు విద్యుత్ మోటార్లు మొరాయించాయి. మూడింటిని మరమ్మతులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు అంజల, నరేష్, వార్డు ఇన్‌చార్జ్‌లు హమాలి రామాంజి, వెల్డింగ్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఎంఈఓ మృతి


బాల ఓబుళరెడ్డి(ఫైల్)

యాడికి: అనారోగ్యంతో విశ్రాంత ఎంఈఓ బాల ఓబుళరెడ్డి బుధవారం ఉదయం పెద్దవడుగూరు మండలం లక్షుంపల్లెలో తన స్వగృహంలో మృతి చెందారు. ఈయన 2001లో యాడికి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంతోపాటు ఇన్‌చార్జ్ ఎంఈఓగా పని చేశారు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు బాల ఓబుళరెడ్డి మృతికి సంతాపం తెలియజేశారు.

మహిళలకు ఒడి బియ్యం

తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్ బజార్‌లోని కన్యాక పరమేశ్వరీదేవి ఆలయంలో బుధవారం ఆర్యవైశ్య సంఘం, మహిళ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో 102 మంది ఆర్యవైశ్య పేద మహిళలకు ఒడిబియ్యం పెట్టారు. తల్లిదండ్రులేని మహిళల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని 102 మంది మహిళలకు చీర, జాకెట్స్‌తో ఒడి బియ్యం పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరత్న, అరుణ తెలిపారు.

గడ్డివామి దగ్ధం

గార్లదిన్నె: కల్లూరు అగ్రహారంలో బుధవారం జరిగిన ప్రమాదంలో గడ్డివామి దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు.. లక్ష్మి అనే మహిళ గేదెల మేత కోసం రూ.5,500 వరి గడ్డి కట్టలు కొనుగోలు చేసి వామి వేసింది. గుర్తుతెలియని వ్యక్తులు వామికి నిప్పుపెట్టడంతో గడ్డి మొత్తం కాలిపోయింది. దాదాపు రూ.1.5 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితురాలు వాపోయింది.

రేపు మండల మీట్

నార్పల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

అడుసుమిల్లి.. ఆలయంలో లొల్లి

- శివాలయంలో జేసీ అనుచరుడి పెత్తనం
- బీఎస్4 వాహనాల కేసులోనూ ప్రధాన నిందితుడు
- భక్తులపై దురుసు ప్రవర్తన


బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం(ఫైల్)

తాడిపత్రి: టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి కోటరీలో ఆయనో ముఖ్యుడు. బీఎస్-4 వాహనాల కేసుల్లోనూ ఆయన ప్రధాన నిందితుడు. వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్ కేసుల్లో రిమాండ్‌కు వెళ్లి వచ్చాడు. జేసీలకు చెందిన పెట్రోల్ బంకులను లీజ్ పొంది వారికి బినామీగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో తాను ఏమి చేసినా చెల్లుతుందని, తనను ఎవరూ ఏమీ చేసుకోలేరన్న అహంకారపూరిత ధోరణితో స్థానిక బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయాన్ని వేదికగా చేసుకుని హల్‌చల్ చేస్తున్నాడు. వివరాల్లో కెళితే.. బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ వ్యవహారంలో టీడీపీ నేత అడుసుమిల్లి వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. అర్చకులు, భక్తులు.. చివరకు ఆలయ పాలకమండలి సభ్యులపై కూడా పెత్తనం చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాను చెప్పినట్లే నడుచుకోవాలని అర్చకులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. భక్తులు హారతి పళ్లెంలో వేసే దక్షిణ(కానుకలు)ల వివరాలు సైతం తనకు చెప్పాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. అర్చకుల కదలికలు, వారి వ్యవహారాలపై ఓ కన్నేసి వారిని అప్పుడప్పుడు తన చేష్టలతో అవహేళన చేస్తుండడంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ఈయన ఉన్నవీలేనివీ చెప్పడంతో ఇటీవల ఆలయానికి వచ్చిన జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రొటోకాల్ పేరుతో అర్చకులపై మండిపడినట్లు సమాచారం.

ఆలయ కైంకర్యాల్లోనూ జోక్యం

అడుసుమిల్లి శివ దీక్ష పేరుతో మాల వేసి ఆలయాన్నంతటిని తన చెప్పుచేతుల్లోకి తీసుకోవడమే కాకుండా ఆలయంలోనే తిష్టవేసి ఆలయ కైంకర్యాల్లోనూ జోక్యం చేసుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ఆలయంలో ఏదైనా కార్యక్రమం నిర్వహించాలంటే అందుకు దేవదాయ శాఖ, పురావస్తు శాఖ అనుమతులు తప్పనిసరి. కానీ సదరు టీడీపీ నాయకుడు ఎవరి అనుమతి లేకుండా ఆలయంలో తన అనుమతి లేనిదే ఏమీ జరగకూడదని హుకుం జారీ చేస్తున్నట్లు తెలిసింది. తాతకు దగ్గు నేర్పిన చందంగా సదరు నాయకుడు పూజా కైంకర్యాల్లో కూడా తాను చెప్పిన విధంగానే పూజలు జరపాలని అర్చకులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. మహాశివరాత్రి పర్వదినం రోజున అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో ఆలయంలో హల్‌చల్ చేస్తూ పలువురిపై దురుసుగా వ్యవహరిస్తుండడంతో అర్చకులే ఆ నాయకుని తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాము అర్చకులమా కాదా స్వామి వారి పూజా కైంకర్యాల్లో ఆయన జోక్యం చేసుకోవడం ఏమిటని విస్తుపోతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఆలయానికి తానే అధిక మొత్తంలో విరాళాలు ఇస్తున్నానని...ఇంతకన్నా ఎవరు ఇస్తారని అర్చకులను బుకాయిస్తున్నట్లు తెలిసింది.

ఆలయ పాలకమండలిపైనా పెత్తనం

ఆలయంలో జరిగే ఉత్సవాలు, కార్యక్రమాల పర్యవేక్షణ కోసం నియమించిన పాలకమండలిపైన సదరు నాయకుడు పెత్తనం సాగిస్తున్నాడు. ఏటా మాఘ మాసంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ పాలకమండలి సభ్యులు ఉత్సవాల్లో ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం ఉండాలన్న ఉద్దేశంతో భక్తుల నుంచి ధన, ధాన్య వస్తు రూపేణా విరాళాలు సేకరిస్తారు. కానీ ఆ నాయకుడు అధికమొత్తంలో విరాళాలు ఇస్తుండడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంపై ఆలయ పాలకమండలి సభ్యులు కూడా బహిరంగంగా నోరుమెదపక లోలోపల కుమిలిపోతున్నారు. కార్తీక మాసం,బ్రహోత్సవాల సమయంలో ఆలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఆలయంలో తిష్టవేసిన అడుసుమిల్లి ఆలయానికి వచ్చే భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అడుసుమిల్లి ఆగడాలు మచ్చుకు కొన్ని:

- గత ఏడాది నవంబర్ 13న ఆలయంలో బుగ్గరామలింగేశ్వరునికి బిల్వాష్టకం చేపట్టారు. ఈసందర్భంగా సదరు టీడీపీ నాయకుడు ఆలయంలో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా శివ మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశాడు. అయితే తానే భిక్షను ఏర్పాటు చేస్తున్నాననే అహంకారపూరిత ధోరణితో భిక్ష స్వీకరించేందుకు వచ్చిన దీక్షాపరుల మనోభావాలు దెబ్బతినేలా దురుసుగా ప్రవర్తించాడు.
- ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ పరిధిలో ఉంచిన స్వామి రథానికి ఎటువంటి అనుమతులు లేకుండా శివదీక్ష పాదయాత్ర చేసే బ్యానర్‌ను కట్టాడు.
- గత ఏడాది కార్తీకపౌర్ణమి రోజు ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉండేది. దీంతో భక్తులు ఎక్కువ మంది వచ్చి బుగ్గరామలింగేశ్వరున్ని దర్శించుకున్నారు. ఈసందర్భంగా హారతిపళ్లెంలో కానుకలు సమర్పించారు. దీంతో అక్కడే ఉన్న అర్చకుల వద్దకు వెళ్ళి ఈ రోజు కలెక్షన్ ఎంత వసూలైందని వ్యంగ్యంగా మాట్లాడాడు.
- గత ఏడాది నవంబర్ 23న భస్మాభిషేకం సందర్భంగా ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆ సమయంలో సాధారణ భక్తులు భోజనం చేస్తుండగా మహిళలని చూడకుండా ఇష్టారాజ్యంగా వారిపై విరుచుకుపడ్డాడు.

వ్యాపారం పేరుతో గొర్రెల కాపరులకు మోసం


ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న గొర్రెల కాపరులు

పుట్లూరు: మడ్డిపల్లికి చెందిన నారపరెడ్డి అనే వ్యక్తి గొర్రెలు, పొట్టేళ్ల వ్యాపారం పేరుతో మోసం చేశారని పలువురు గొర్రెల కాపరులు బుధవారం ఎస్‌ఐ వెంకటప్రసాద్‌కు పిర్యాదు చేశారు. గొర్రెలను, పొట్టేళ్లను కొనుగోలు చేసి డబ్బు ఇవ్వలేదన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో సూర్యనారాయణ, సూరి, రామంజి, వెంకటరాముడు, రాముడు ఉన్నారు

ఒకరికి గాయాలు

పామిడి: గజరాంపల్లి క్రాస్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు..గార్లదిన్నె మండలం బాట్లో కొత్తపల్లికి చెందిన రామకృష్ణ పనిమీద బైక్‌పై గుత్తికి బయలుదేరాడు. అనుంపల్లి గ్రామానికి చెందిన రాము ట్రాక్టర్‌లో మొద్దులు వేసుకుని గజరాంపల్లి క్రాస్ వద్ద రోడ్డుపైకి వేగం వచ్చాడు. ఈక్రమంలో బైక్‌పై వెళుతున్న రామకృష్ణను ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు అనంతపురం సర్వజనాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నాటుసారా విక్రేత అరెస్టు

యాడికి: గుడిపాడు గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న కంబగిరి రాముడును బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. నిందితుడి నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

అడిగిన ప్రతి కూలీకీ పనులు కల్పించండి

యల్లనూరు: అడిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని ఏపీవో షబ్బీర్‌బాషా పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి పనులు కల్పించి వలసలు అరికట్టాలన్నారు. నూతనంగా పనులను గుర్తించి ఉపాధి పనులకు వెళ్లేలా అవగాహన కల్పించాలని సాంకేతిక సిబ్బందికి సూచించారు. ఈసీ బబ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి

పుట్లూరు: ఉపాధి హామీ పనులను అన్ని గ్రామ పంచాయతీల్లో వేగవంతం చేయాలని ఏపీఓ చెన్నకేశవులు సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో నీడ, నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలన్నారు.

5న చెవి శస్త్ర చికిత్స శిబిరం

గుంతకల్లుటౌన్: చెవి వినికిడి, చెవి సంబంధిత సమస్యలతో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకునే ఆర్థిక స్థోమత లేని పేదల కోసం పారిశ్రామికవేత్త సత్రశాల జగదీష్ గుప్త సౌజన్యంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మార్చి 5న ఉచిత మెగా శస్త్ర చికిత్స శిబిరాన్ని నిర్వహించనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు వి.ప్రదీప్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోటరీహైస్కూల్‌లో శిబిరానికి చిత్రదుర్గంకు చెందిన వైద్యనిపుణులు డాక్టర్ ప్రహ్లాద వైద్య బృందం హాజరవుతుందని పేర్కొన్నారు. వివరాలకు 88974 03399, 95337 68123 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దివ్యాంగుడికి అమ్మ సంస్థ చేయూత


దివ్యాంగుడు పోతన్నకు నిత్యావసరాలు, రూ.15 వేలు అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

శింగనమల: స్థానిక బోయవీధికి చెందిన పోతన్న చిన్నవయస్సులోనే వెన్నెముక దెబ్బతినడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు. భార్య కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తోంది. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ వ్యవస్థాపకులు తరిమెల రమణారెడ్డి బుధవారం శింగనమలలోని వారి ఇంటికి వచ్చి పరామర్శించారు. మూడు నెలలకు సరిపడా నిత్యవసరాలు, మూడు బస్తాల బియ్యం, ముగ్గురికీ దుస్తులు, రూ.15 వేలు నగదు అందించారు. దీనితో పాటు నివాసానికి అవసరమైన షెడ్ నిర్మాణం, వైద్య సేవలు అందించేందుకు సహకారం అందిస్తానన్నారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తరిమెల రమణారెడ్డి భరోసా కల్పించారు.

క్యాలెండర్‌లో గుత్తి విద్యార్థులకు చోటు


క్యాలెండర్‌ను విద్యార్థులు ఖ్యాతిరెడ్డి, ప్రవీణ్ ప్రసాద్‌లకు అందిస్తున్న ఎంఈఓ రవి నాయక్

గుత్తి: బెంగళూరుకు చెందిన సరళ యోగా వేదిక విడుదల చేసిన అంతర్జాతీయ చిల్డ్రన్స్ యోగాసన క్యాలెండర్-2023లో గుత్తి ఆర్‌కె యోగా కేంద్రం విద్యార్థులు ఖ్యాతిరెడ్డి(శ్రీసాయి స్కూల్), ప్రవీణ్ ప్రసాద్(శ్రీరామానుజన్ స్కూల్)కు చోటు దక్కింది. మొత్తం 18 దేశాలకు చెందిన 500 మంది బాల బాలికలు పోటీ పడ్డారు. అంతర్జాతీయ క్యాలెండర్లను బుధవారం గుత్తి ఎంఈఓ రవి నాయక్ ఖ్యాతిరెడ్డి, ప్రవీణ్ ప్రసాద్‌కు అందజేశారు. ఆర్‌కే యోగా శిక్షకులు రామకృష్ణారావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి


గోపురాజుపల్లిలో ప్రచారం చేస్తున్న వెన్నపూస చెన్నకేశవరెడ్డి

పెద్దవడుగూరు : వైఎస్సార్‌సీపీ తరపున పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల కో ఆర్డినేటర్ వెన్నపూస చెన్నకేశవరెడ్డి పట్టభద్రులను కోరారు. బుధవారం ఆయన గోపురాజుపల్లి, చిత్రచేడు, నాగలాపురం, కొండూరు, చిన్నవడుగూరు, చిట్బూరు, పి.వీరన్నపల్లి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెన్నపూస రవీంద్రారెడ్డి గెలిస్తే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తారన్నారు. మండలంలోని ప్రతి పట్టభద్రుడు వెన్నపూస రవీంద్రారెడ్డి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

రోడ్డు పరిశీలన

పామిడి: స్థానిక వెంగమనాయుడు కాలనీ, సరస్వతీ విద్యామందిరం కాలనీలను అనుసంధానం చేస్తూ ఎన్‌హెచ్-44, బీసీసీ రోడ్లను కలుపుతూ ఏర్పాటు చేసిన గరుసు రోడ్లను బుధవారం సాయంత్రం ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ పరిశీలించారు. ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి చొరవతో గరుసు రోడ్డు ఏర్పాటు చేయడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బీకే అన్వర్‌బాషా, సీ అబ్దుల్‌రజాక్, కేఎం మహబూబ్‌బాషా, అబుసాలేహా, మహేశ్వర్‌రెడ్డి, చాకలి సుంకన్న, వలి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: తిమ్మంపేటలో బుధవారం ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు.108 సిబ్బంది వివరాల మేరకు.. తిమ్మంపేటకు చెందిన పక్కీరప్ప అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పంట నమోదుపై సూపర్ చెక్


వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ మద్దిలేటి

శింగనమల: శింగనమల చెరువు కింద సాగైన వరి పంట నమోదుపై వ్యవసాయాధికారులు సూపర్ చెక్ చేశారు. బుధవారం ఏడీఏ మద్దిలేటి, ఏఓ చిన్నమ్మలు వరి పొలాలను పరిశీలించారు. వ్యవసాయాధికారులు నమోదు చేసిన పంట వివరాలను ఏ సర్వే నంబరులో ఏ పంట నమోదు చేశారో, వాస్తవంగా ఉందా లేదోనని తనిఖీ చేశారు. వారి వెంట ఏఈఓ అక్కమ్మ, సర్వేయర్ పవన్, విఆర్‌ఏ రామాంజినేయులున్నారు.

పప్పుశనగకు ప్రభుత్వం మద్దతు ధర

గార్లదిన్నె: ప్రభుత్వం పప్పుశనగకు రూ.5,335 మద్దతు ధర కల్పిస్తోందని వ్యవసాయ కమిషనరేట్ ఏడీ మద్దిలేటి పేర్కొన్నారు. బుధవారం కృష్ణాపురం, కమలాపురంలో రైతులు సాగుచేసిన పంటలను ఆయన పరిశీలించారు. అనంత రం ఆయన మాట్లాడుతూ పప్పుశనగ సాగుచేసిన రైతులు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆర్బీకే సిబ్బంది రబీలో పంటలు సాగు చేసిన రైతులకు ఈ- క్రాప్ బుకింగ్, ఈకేవైసీ తప్పని సరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో అనంతపురం ఏడీఏ వెంకటరాముడు, ఏఓ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్‌గా అశోక్‌కుమార్‌రెడ్డి

యల్లనూరు: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనరుగా వేములపల్లి సర్పంచు అశోక్‌కుమార్‌రెడ్డి, కో కన్వీనర్లుగా రవికుమార్‌రెడ్డి(పెద్దమల్లేపల్లి), అంజన్(కోడిమూర్తి), రామనాథరెడ్డి(వెన్నపూసపల్లి), శరణ్‌కుమార్‌రెడ్డి (అచ్యుతాపురం) నియమితులయ్యారు. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

గ్రంథాలయం తనిఖీ


పాఠకులతో మాట్లాడుతున్న డైరెక్టర్ ప్రసన్నకుమార్

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయాన్ని బుధవారం పౌర గ్రంథాలయ రాష్ట్ర డైరెక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయ రికార్డులు, గ్రంథాలయ భవనాన్ని, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పాఠకులతో కాసేపు ముచ్చటించారు. ప్రస్తుతం పోటీ ప్రపంచం నడుస్తోందని, అందరూ విజ్ఞానాన్ని ఆర్జించాలన్నారు. విద్య, విజ్ఞానం మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో వ్యాధుల నివారణ


పశువులను పరీక్షిస్తున్న జిల్లా పశువైద్యాధికారులు

నార్పల: ముందు జాగ్రత్తలతో పశువులలో సంక్రమించే వ్యాధులను నివారించవచ్చని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు సుధాకర్, పశుసంవర్ధక శాఖ జిల్లా ఉపసంచాలకులు రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో ఎదకురాని, చూడి నిలువని పశువులను పరీక్షించి వాటి పేడ, మూత్రం, రక్తం, సీరం నమూనాలను పరీక్షా కేంద్రానికి పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.500తో పాడి పశువులకు ఎద సూదులు వేస్తామని, దీని ద్వారా 95 శాతం పెయ్య దూడలు పుట్టే అవకాశం ఉందన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు వినోద్‌కుమార్, గోవిందరాజులు, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి


గాంధీనగర్ సచివాయాల సెక్రటరీతో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ ఓబులమ్మ

తాడిపత్రి టౌన్ : వార్డు సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీయల్‌డీఓ ఓబులమ్మ సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాతో సమావేశం అనంతరం గాంధీ నగర్, ఆస్పత్రి పాలెం, విజయనగర్‌కాలనీ, వాటర్ వర్క్స్‌రోడ్డులోని సచివాయాలను డీయల్‌డీఓ తనిఖీ చేశారు. వార్డు సచివాలయాల ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట మున్సిపల్ మేనేజర్ రాజేశ్వరీబాయి, టీపీఎస్ సతీష్, వార్డు సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు ఉన్నారు.

సచివాలయాల తనిఖీ

పెద్దపప్పూరు: మండలంలోని జూటూరు, సోమనపల్లె, చిక్కేపల్లె గ్రామ సచివాలయాలను బుధవారం డీఎల్‌డీఓ ఓబులమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి సచివాలయాలోని రికార్డులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. సంక్షేమ పథకాలు పేదలందరికీ వర్తింజేయడంతో పాటు విధులకు సకాలంలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ తదితరులు పాల్గొ న్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విశాలాక్షి

గుత్తి రూరల్: ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మూడు నెలల్లో అన్ని శాఖల్లో జరిగిన ప్రగతి, ప్రతిపాదనలపై చర్చించారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో పప్పుశనగ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని ఏఓ ముస్తాక్ అహ్మద్ తెలిపారు. గుత్తి-గుంతకల్లు మార్గంలో 67వ నంబర్ జాతీయ రహదారి పనులు త్వరగా పూర్తి చేయాలని చెర్లోపల్లి సర్పంచ్ అప్పా వెంకటేష్ కోరారు. కరిడికొండ పంచాయతీలో నూతన స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ రమేష్ కోరారు. గ్రామాల్లో రైతుల పొలాల్లో వేసిన ప్రభుత్వం వేసిన జలకళ బోర్లకు విద్యుత్ కనెక్షన్లు త్వరగా ఇవ్వాలని విద్యుత్ అధికారులను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, సీఐ వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీలు తిరుపాలమ్మ, నాగేశ్వరమ్మ, ఎంఈఓ రవినాయ క్, సర్పంచ్‌లు చిదంబరి, సుశీలమ్మ, రాజేశ్వరి, వాసుదేవరెడ్డి, చిన్న ఆంజనేయులు, గోపాల్, ఎంపీటీసీలు వీరన్న, సుమలత, శంకరమ్మ, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, మండల ఏఈ దివ్యప్రకాష్, కార్యదర్శులు సాదిక్, ధనలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

తాడిపత్రి: రూరల్ పరిధిలోని తాడిపత్రి-కడప ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. కడప జిల్లా జమ్మలమడుగు మండలం హనుమంతగిరి గ్రామానికి చెందిన రామసుబ్బయ్య బైక్‌పై తాడిపత్రికి బయలుదేరాడు. తాడిపత్రి రూరల్ పరిధిలోని ఆర్‌జే స్టీల్ ప్లాంట్ సమీపంలో ఉన్న పెట్రోల్ పంపు వద్ద రహదారిపై తాడిపత్రి వైపు నుంచి కడప వైపుకు వెళుతన్న ఐచర్ వాహనం బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామసుబ్బయ్యను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తీసుకెళ్లారు. రూరల్ ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌లు ఢీకొని...

తాడిపత్రి అర్బన్: బైక్‌లు ఢీకొన్ని ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ పోలీసుల వివరాల మేరకు.. బుధవారం సాయంత్రం పట్టణంలోని కృష్ణాపురం 7 రోడ్డు సమీపంలో రమేష్‌రెడ్డి కాలనీకి చెందిన ఫకృద్దీన్ బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరోబైక్ ఢీకొంది. ఘటనలో ఫకృద్దీన్ ఎడమ కాలు పూర్తిగా ఛిద్రమైపోయింది. స్థానికులు అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకుని బాధితున్ని పరామర్శించి అంబులెన్స్‌లో అనంతపురానికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.